సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 17 । నవంబర్ । 2023



ఎన్నికలపై పాఠం!

పదో తరగతి సాంఘికశాస్త్రం పాఠ్యపుస్తకంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఉన్న పాఠం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. 10లో



మతోన్మాద పార్టీలను ఓడిద్దాం

ఈ ఎన్నికల్లో మతోన్మాద, ఫాసిస్టు పార్టీలను ఓడించాలని ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. 10లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 33° / 19°

జిల్లాలో శుక్రవారం చలి ఎక్కువగా ఉంటుంది. ఉదయం మంచు ప్రభావం కనిపించడంతో పాటు సాయంత్రం చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల్లో వైద్యశిబిరాలు

ఖమ్మం వైద్యవిభాగం: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈనెల 30న జరగనుండగా, పోలింగ్ కేంద్రాల్లో వైద్య, ఆరోగ్య శాఖ వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం జిల్లాలోని 822 పోలింగ్ కేంద్రాలకు 1,381 మంది పారా మెడికల్ సిబ్బందిని కేటాయించారు. వీరిలో 27 మంది మెడికల్ ఆఫీసర్లు, 476 మంది ఏఎన్ఎం, ఎంపీహెచ్‌ఏ, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, పీహెచ్ఆర్‌సీలు, 878 మంది ఆశా కార్యకర్తలు ఉంటారు. అంతేకాకుండా ఐదు నియోజకవర్గాలకు కలిపి 18మొబైల్ టీమ్‌లను ఏర్పాటుచేయనున్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లు, సిబ్బందిలో ఎవరికైనా అనారోగ్య సమస్య వస్తే వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పరీక్షించి మందులు ఇవ్వడమే కాక అత్యవసరమైతే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తారు.

ఎస్సెస్సీ పరీక్ష ఫీజు చెల్లించండి

ఖమ్మం సహకారనగర్: వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు డిసెంబర్ 2వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ ఈ.సోమశేఖర శర్మ సూచించారు. కాగా, రూ.50అపరాధ రుసుంతో డిసెంబర్ 12వరకు, రూ.200అపరాధ రుసుంతో డిసెంబర్ 21 వరకు, రూ.500అపరాధ రుసుముతో జనవరి 3వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశముందని ఆయన తెలిపారు.

లింగ సమానత్వాన్ని కాపాడాలి

ఖమ్మంఅర్బన్: లింగ సమానత్వాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా మహిళా సంక్షేమ అధికారి సుమ సూచించారు. ఖమ్మంలోని రోటరీనగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమ మాట్లాడుతూ లింగ వివక్షతను రూపుమాపేలా ఉపాధ్యాయులు పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం జిల్లా మహిళా సాధికారత హబ్ ఆధ్వర్యాన ఆడపిల్లల భద్రతకు తీసుకుంటున్న చర్యలు, హెల్ప్ లైన్ నంబర్ వివరాలు వెల్లడించారు. పాఠశాల హెచ్ఎం మోతుకూరి మధుతోపాటు ఎస్.డీ.సబ్రీన్, పగిడిపల్లి ప్రమీల, కె.పద్మావతి, సుభాషిణి, నాగమణి, సునీల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రారంభం



ఓటరు స్లిప్‌ల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్

కొణిజర్ల: జిల్లాలో ఓటర్లకు సమాచార చీటీల పంపిణీ గురువారం మొదలైంది. ఈ సందర్భంగా కొణిజర్ల మండలం తనికెళ్లలో ఓటరు స్లిప్పుల పంపిణీని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులతో మాట్లాడిన ఆయన సిబ్బందికి ఇంటికి వచ్చి స్లిప్పులు ఇచ్చారా, సీ విజిల్ యాప్ వివరాలు వెల్లడించారా లేదా అని ఆరా తీశారు. అలాగే, తహసీల్దార్ తఫజుల్ హుస్సేన్‌కు పలు సూచనలు చేశారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా ఓటు వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎంపీడీఓ కె.మహాలక్ష్మి, సర్పంచ్ చల్లా మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్‌కు కొత్త మిర్చి

– తేజా మిర్చి క్వింటాకు రూ.22 వేలు



మిర్చి తీసుకొచ్చిన రైతుతో మాట్లాడుతున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఈ ఏడాది రైతులు సాగు చేసిన మిర్చి పంట ఇప్పుడిప్పుడే చేతికొస్తోంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు గురువారం సూర్యాపేట జిల్లా మోతె మండలం భాగ్యనగర్ తండాకు చెందిన సూర్యానాయక్ ఎనిమిది బస్తాల మిర్చి తీసుకురాగా, క్వింటాకు రూ.22 వేల ధర పలికింది. మిర్చికి గతేడాది మంచి ధర రావడంతో రైతులు ఈ ఏడాది కొన్ని ప్రాంతాల్లో జూన్‌లోనే నార్లు పోసి జూలైలో మిర్చిని నాటారు. ఆ మిర్చి సాగు ప్రస్తుతం కాత దశలో ఉండగా, మార్కెట్‌కు రావడం మొదలైంది.

అగ్రనేతల అడుగులు



కేసీఆర్



రాహుల్‌గాంధీ





కేటీఆర్



ప్రియాంకా గాంధీ

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఖరారు కావడంతో ప్రచారం జోరందుకుంటోంది. ఈనెల 28న సాయంత్రంతో ప్రచారం ముగియనుండగా.. మిగిలిన కొద్ది సమయంలో అభ్యర్థులు తమ పార్టీల ముఖ్యనేతలను రప్పించి సభల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు నేతల ప్రచార షెడ్యూళ్లు ఖరారయ్యాయి. ఈ ప్రచారం ద్వారా ప్రత్యర్థి పార్టీలకు సవాల్ విసిరేలా భారీ జన సమీకరణపై అభ్యర్థులు దృష్టి సారించారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

నేడు మణుగూరుకు రాహుల్‌గాంధీ

- 21న మధిర, వైరాల్లో సీఎం కేసీఆర్ సభలు.. త్వరలోనే కేటీఆర్ రోడ్డుషో
- 22 తర్వాత ఉమ్మడి జిల్లాలో ప్రియాంకాగాంధీ పర్యటన
- 24న మాజీ సీఎం మాణిక్ సర్కార్, 25న సీతారాం ఏచూరి రాక



సీతారాం ఏచూరి



మాణిక్ సర్కార్

రాహుల్, ప్రియాంక రోడ్‌షోలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున పార్టీ అగ్రనేతలు ప్రచారానికి రానున్నారు. శుక్రవారం పినపాక నియోజకవర్గం మణుగూరులో జరిగే రోడ్డు షో, కార్నర్ మీటింగ్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొంటారు. మాజీ ఎంపీ పొంగులేటి కాంగ్రెస్‌లో చేరిక, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర ముగింపు సందర్భంగా ఈ ఏడాది జూలై 2న ఖమ్మంలో జరిగిన సభకు రాహుల్ హాజరయ్యారు. ఆ తర్వాత మళ్లీ ఎన్నికల ప్రచారం కోసం ఇప్పుడు వస్తున్నారు. ఎన్నికల ప్రచారం ముగిసేలోగా మరోసారి రాహుల్‌గాంధీ ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈనెల 22 తర్వాత ప్రియాంకాగాంధీ పలు నియోజకవర్గాల్లో జరిగే రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

సీపీఎం అగ్రనేతలు సైతం..

పాలేరు నుంచి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఇంకొన్ని చోట్ల ఆ పార్టీ నాయకులు ఎన్నికల బరిలో ఉన్నారు. దీంతో అభ్యర్థుల తరఫున ఈనెల 24న త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్ ఖమ్మం, ముదిగొండలో, 25న భద్రాచలం నియోజకవర్గంలోని వాజేడు, భద్రాచలం, 26న పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచిలో జరిగే సభలు, రోడ్‌షోలకు హాజరుకానున్నారు. అలాగే, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఈనెల 25న పాలేరులో తమ్మినేని వీరభద్రం తరఫున జరిగే ప్రచార సభలో పాల్గొంటారు. ఇంకా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ 25న వైరాలో రోడ్‌షోలో, మధిర నియోజకవర్గం బోనకల్‌లో జరిగే సభలో ప్రసంగిస్తారు. అంతేకాకుండా 27న భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం, చర్లలో రోడ్‌షోలు నిర్వహిస్తారు. మరో పొలిట్‌బ్యూరో సభ్యుడు విజయ రాఘవన్ సైతం ఈనెల 20వ తేదీన భద్రాచలం నియోజకవర్గంలోని వెంకటాపురం సభలో పాల్గొననున్నారు.

అటు కేసీఆర్.. ఇటు కేటీఆర్

బీఆర్ఎస్ ముందుగానే అభ్యర్థులను ప్రకటించి ప్రచారాన్ని మొదలుపెట్టింది. ఈమేరకు సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి ఏడు చోట్ల జరిగిన ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. ఇక 21న మధిర, వైరాలో జరిగే ప్రజా ఆశీర్వాద సభలకు ఆయన హాజరవుతారు. తద్వారా ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో సభలు పూర్తవుతాయి. అలాగే, మంత్రి కేటీఆర్ కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, ఖమ్మంలో జరిగే రోడ్డుషోలకు హాజరుకానుండగా, తేదీ ఖరారు కావాల్సి ఉంది. కాగా, హోం మంత్రి మహమూద్ అలీ ఖమ్మంలో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ తరఫున గురువారం జరిగిన రోడ్ షో, సభల్లో పాల్గొన్నారు.

అగ్రనేతల రాకతో..

ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున ప్రచారానికి అగ్రనేతలు వస్తుండడంతో జిల్లాలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కనుంది. ప్రచారానికి మిగిలిన 12 రోజుల్లో అన్ని పార్టీల నేతలు ఇక్కడ జరిగే సమావేశాల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే కొందరి పర్యటన షెడ్యూళ్లు ఖరారు కాగా, మరికొందరివి ఖరారు కావాల్సి ఉంది. ప్రచారానికి మిగిలిన సమయాన్ని ఏ మాత్రం వదులుకోవద్దనే భావనతో అగ్రనేతలు సభల కన్నా రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తద్వారా ఎక్కువ మంది ప్రజలను కలవొచ్చనే భావనతో ఉన్నట్లు సమాచారం.

రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కాదు.. ఆర్‌ఎస్‌ఎస్





ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు (ఇన్‌సెట్) పువ్వాడ అజయ్‌ని గెలిపించాలని కోరుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

- అరవై ఏళ్లలో మైనార్టీలకు ఆ పార్టీ చేసిందేమీ లేదు
- రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నాయకుడు కాదని.. ఆయన ఆర్ఎస్ఎస్ నాయకుడని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. కాంగ్రెస్‌లో 20 మంది సీఎం అభ్యర్థులు ఉండగా... బీఆర్ఎస్‌లో కేసీఆర్ మాత్రమే సీఎం అని తెలిపారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణలో మైనార్టీల సంక్షేమానికి రూ.2,400 కోట్లు వెచ్చించగా, తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంతోపాటు మైనార్టీలు అభివృద్ధి చెందారని తెలిపారు. సీఎం కేసీఆర్ ముస్లిం పిల్లల కోసం స్కూళ్లు, కాలేజీలు ఏర్పాటుచేయడమే కాక షాదీ ముబారక్ పథకంతో ముస్లిం ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్కరోజు కర్ఫ్యూ విధించలేదని గుర్తుచేశారు. తెలంగాణ రాక ముందు కరెంట్ కష్టాలు ఉండడమేకాక పరిశ్రమలు, రైతులకు విద్యుత్ సరఫరా సక్రమంగా జరగలేదని.. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి పోయిందని తెలిపారు. అలాగే, మిషన్ భగీరథతో నీటి కష్టాలు తీరాయన్నారు. కాగా, ఓ సమావేశంలో తాను ముస్లిం మత పెద్దపై చెప్పిన మాటలను వక్రీకరించారని, తన మాటలు ఎవరికైనా ఇబ్బంది కలిగించి ఉంటే క్షమాపణ చెబుతున్నట్లు మహమూద్ అలీ పేర్కొన్నారు.

ఎక్కడా జరగని అభివృద్ధి ఖమ్మంలో...

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఖమ్మంలో అభివృద్ధి జరిగిందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ తెలిపారు. ఖమ్మంలో జరిగిన ముస్లిం, మైనారిటీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ పువ్వాడ నిత్యం ప్రజల బాగోగులు, ఖమ్మం అభివృద్ధిపైనే దృష్టి సారిస్తారని చెప్పారు. ఇక్కడి ముస్లింలు ఆయనను అజయ్ ఖాన్‌గా పిలుచుకుంటారని... గతంలో కంటే ఎక్కువ మెజారిటీతో ఈసారి గెలిపించాలని కోరారు. కాగా, కాంగ్రెస్ ముసలి పార్టీ అని.. వీల్‌చైర్‌లో తిరిగే వృద్ధుడు కావాలా, యువకుడైన పువ్వాడ అజయ్ కావాలో నిర్ణయించుకోవాలని తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్లు అన్ని అంశాలను బేరీజు వేసుకుని ఓటు వృథా కాకుండా కారు గుర్తుపై వేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర మంత్రి, ఖమ్మం అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ 2018లో జరిగిన మైనారిటీ సభలో మహమూద్ అలీ వచ్చి తన తరఫునప్రచారం చేయగా గెలిచానని తెలిపారు. అనంతరం మున్సిపల్ ఎన్నికల సమయాన సభ పెడితే వన్‌టౌన్‌లోని 16 స్థానాల్లో బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేసిందన్నారు. మళ్లీ ఈసారి కూడా సెంటిమెంట్ పునరావృతమవుతుందనే నమ్మకం ఉందని తెలిపారు. గతంలో ఖమ్మం ఎలా ఉంది, ఇప్పుడు ఎలా అభివృద్ధి చెందిందో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈసమావేశాల్లో ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్‌తో పాటు నాయకులు గుండాల కృష్ణ, జహీర్‌అలీ, ఖమర్, షౌకత్ అలీ, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారు..

- కేసీఆర్‌ను ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు..
- పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బచ్చోడులో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ కుటుంబం ప్రజలకు మేలు చేయకపోగా వారి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిందని పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఈమేరకు ఆయనను ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో గురువారం జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రెండు సార్లు కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేస్తే ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. తెలంగాణ తెచ్చుకున్నది దోచుకోవడానికే అన్నట్లుగా సీఎం తీరు ఉందని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు భావిస్తే పేపర్ల లీకేజీతో బతుకులు ఆగం చేశారన్నారు. అంతేకాక పేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు రాలేదని, అర్హులెవరికీ సంక్షేమ పథకాలు అందలేదని పేర్కొన్నారు. ఈమేరకు కేసీఆర్‌కి తగిన గుణపాఠం చెప్పి.. కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని కోరారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. ఆ వెంటనే భూమిలేని పేదలకు ఏటా రూ.12 వేలు, ప్రతీ ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, నెలనెలా రూ.2,500 సాయం, రూ.4వేల పింఛన్ అమలుచేస్తామని పొంగులేటి తెలిపారు. కర్ణాటకకు చెందిన నాయకుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ కర్ణాటకలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చామని చెప్పారు. అయినా బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రచారంలో జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, ఎంపీపీ మంగీలాల్, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నాయకులు రాయల నాగేశ్వరరావు, స్వర్ణకుమారి, నరేష్‌రెడ్డి, హరితారెడ్డి, అరవిందరెడ్డి, బుద్దా వంశీకృష్ణ, కనకయ్య, ఇజ్రాయిల్, గండ్ర గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ ఉద్యోగులకు 'ఆరోగ్య' కిట్లు



ఉద్యోగులకు ఇవ్వనున్న మందుల కిట్లు

ఖమ్మం వైద్యవిభాగం: ఈనెల 30న జరిగే ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి వైద్య ఆరోగ్య శాఖ కిట్లు అందించనుంది. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశాల మేరకు తొలిసారిగా ఉద్యోగుల కోసం 1,500కిట్లు సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలకు ఒకరోజు ముందుగానే వెళ్లే వారికి అనారోగ్య సమస్యలు ఎదురైతే ఉపయోగపడేలా మందులతో కిట్ తయారుచేశారు. ఇందులో తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరోచనాలు, ఇతర సమస్యల నివారణకు ఉపయోగపడే మందులే కాక దూది ఉంటాయి.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించారు. ఆతర్వాత నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించగా, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

తెలంగాణను భ్రష్టు పట్టిస్తున్న పీసీసీ చీఫ్

ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మధు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, సంభాని

నేలకొండపల్లి: తెలంగాణను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి భ్రష్టు పట్టిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆరోపించారు. నేలకొండపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ సీఎం అయ్యాక భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించారని తెలిపారు. అంతేకాక రూ.78 కోట్లతో పాలేరు పాత కాల్వను పునరుద్ధరించారని చెప్పారు. ఈ విషయాలను విస్మరించి రేవంత్‌రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా విధానపరమైన ఆరోపణలు చేసే హక్కు అందరికీ ఉన్నా తండ్రి వయస్సు ఉన్న కేసీఆర్‌ను దూషించడం సరికాదని తెలిపారు. కాగా, ఈ ఎన్నికల్లో స్థానికుడైన కందాళ ఉపేందర్‌రెడ్డిని మరోమారు గెలిపించాలని ప్రజలను కోరారు. సీఎం కేసీఆర్‌తో కొట్లాడి మరీ పాలేరుకు జేఎన్‌టీయూ, నర్సింగ్ కాలేజీని తీసుకొచ్చిన ఘనత కందాళకే దక్కుతుందని తెలిపారు. అనంతరం మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ మాట్లాడుతూ తక్కువ మాట్లాడి ఎక్కువ పని చేసే వ్యక్తి కందాళను మరోమారు గెలిపిస్తే అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగుతుందని చెప్పారు. ఆతర్వాత కందాళ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్ల కోసం అబద్ధాలు చెప్పే అలవాటు తనకు లేదని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా పాలేరు ఎమ్మెల్యేగా తాను గెలవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, మార్కెట్ చైర్మన్ శాంత, నాయకులు పాల్గొన్నారు.

ఓటు విలువ తెలుసుకో !



ఓటు హక్కు నమోదు, ఓటు వేయాల్సిన ఆవశ్యకతపై ఇప్పటివరకు ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీలు, బహిరంగ ప్రదేశాల్లో వాల్ రైటింగ్‌ల ద్వారా అధికారులు అవగాహన కల్పించారు. ఇప్పుడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసిన పాఠశాలలు, కార్యాలయాల్లోని గోడలపై కూడా నినాదాలు రాయిస్తున్నారు. ఓటు అమ్ముకోకు.. వ్యక్తిత్వాన్ని కోల్పోకు, సరైన అభ్యర్థికే ఓటు వేయండి, భయం లేకుండా ఓటు వేసుకోవాలి, బుల్లెట్ కంటే బ్యాలెట్ విలువైనది.. నినాదాలు రాయిస్తుండగా ఓటు వేసేందుకు వచ్చే వారిని ఆలోచింపచేయడం ఖాయమని చెబుతున్నారు. – నేలకొండపల్లి

విద్యాభివృద్ధిలో తొలిమెట్టు, ఉన్నతి కీలకం

ఎస్‌సీఈఆర్‌టీ కోఆర్డినేటర్ సువర్ణ వినాయక్



నేలకొండపల్లి పాఠశాలలో బోధనను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: విద్యార్థుల అభివృద్ధిలో తొలిమెట్టు, ఉన్నతి కీలకపాత్ర పోషిస్తాయని ఎస్‌సీఈఆర్‌టీ కోఆర్డినేటర్ సువర్ణ వినాయక్ తెలిపారు. తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలును సువర్ణ వినాయక్ బృందం గురువారం జిల్లాలోని పలు పాఠశాలల్లో పర్యవేక్షించింది. అనంతరం ఖమ్మంలోని జెడ్పీ హాల్‌లో రిసోర్స్ పర్సన్లు, జిల్లాస్థాయి అధికారులతో సమావేశం కాగా, సువర్ణ వినాయక్ మాట్లాడుతూ.. నిర్వహణలో జాగ్రత్తలు పాటిస్తూ, ఉపాధ్యాయులకు ఎదురయ్యే సమస్యలను అధిగమించాలని సూచించారు. డీఈఓ సోమశేఖర శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్‌సీఆర్‌టీ ప్రొఫెసర్ రవికాంత, డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణతో పాటు సురేశ్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పరిశీలన..

నేలకొండపల్లి/కొణిజర్ల: విద్యాశాఖ రాష్ట్ర మానిటరింగ్ కమిటీ పరిశీలకుల ప్రతినిధి, ఎస్‌సీఈఆర్‌టీ కోఆర్డినేటర్ సువర్ణ వినాయక్ ఆధ్వర్యాన నేలకొండపల్లి, కొణిజర్ల మండలంలోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల అమలుపై ఆరా తీయడంతో పాటు బోధనను పరిశీలించారు. ఆతర్వాత విద్యార్థులను సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. బృందం సభ్యులు పి.ప్రభాకర్ రెడ్డి, అనిల్, ప్రసాద్, సునంద, ఎంఈఓలు బీ.వీ.రామాచారి, మోదుగు శ్యాంసన్‌తో పాటు చలపతిరావు, కె.వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి

రాహుల్ రోడ్‌షో ఏర్పాట్ల పరిశీలనలో భద్రాద్రి ఎస్పీ వినీత్



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ వినీత్, అధికారులు

మణుగూరు టౌన్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం మణుగూరులో జరిగే రోడ్‌షో, కార్నర్ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ వినీత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఓఎస్‌డీ సాయిమనోహర్, ఇంటెలిజెన్స్ డీఎస్పీ వెంకన్నబాబుతో కలిసి గురువారం ఆయన మణుగూరులో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని తనిఖీ చేశాక ఎస్పీ మాట్లాడుతూ హెలిప్యాడ్ పరిసరాల్లో ఎవరూ రాకుండా ఇనుప వలయం ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, అంబేద్కర్ సెంటర్ వద్ద జరిగే కార్నర్ మీటింగ్ నేపథ్యాన ట్రాఫిక్ మళ్లింపు చర్యలపై డీఎస్పీ రాఘవేందర్‌రావు, సీఐ రమాకాంత్‌కు సూచనలు చేశారు. ఆతర్వాత డీఎస్పీ కార్యాలయంలో రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, వైద్యశాఖ అధికారులతో సమావేశమైన ఎస్పీ వినీత్ భద్రతాపరమైన ఏర్పాట్లపై సమీక్షించారు.

క్లుప్తంగా

రాష్ట్ర హోంమంత్రిపై ఫిర్యాదు

ఖమ్మంక్రైం: ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా రాష్ట్ర హోంమంత్రి మహమ్మద్ అలీ మాట్లాడారని పేర్కొంటూ ముస్లిం సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఖమ్మం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కరీంనగర్‌లో జరిగిన బీఆర్‌ఎస్ మైనార్టీ కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడిన తీరుపై అభ్యంతరం వ్యక్తం చేసిన వారు, చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐ స్వామికి ఫిర్యాదు అందజేశారు.

రూ.3.53 లక్షల నగదు పట్టివేత

ఖమ్మంక్రైం: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా సరైన ఆధార పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.3,53,800ల నగదును త్రీటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం తనిఖీలు చేస్తుండగా.. డీమార్ట్ సమీపాన ఓ వ్యక్తి, గాంధీ చౌక్‌లో ఇద్దరి వద్ద నుంచి ఈ నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

బోనకల్ చెక్‌పోస్ట్ వద్ద రూ.1.50లక్షలు

బోనకల్: మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద గురువారం రాత్రి తనిఖీ చేస్తుండగా సరైన పత్రాలు లేకుండా కారులో తీసుకువెళ్తున్న రూ.1.50లక్షల నగదును సీజ్ చేశారు. గుంటూరు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారులో ఉన్న వ్యక్తుల నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సాయికుమార్ తెలిపారు.

బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనాలి

సింగరేణి(కొత్తగూడెం): చట్టబద్ధంగా జరుగుతున్న బొగ్గు బ్లాక్‌ల వేలంలో రాజకీయ కారణాలతో పాల్గొనకపోతే సింగరేణి మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని బీఎంఎస్ నాయకుడు, కోల్ సెక్టార్ ఇన్‌చార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు వేలంలో పాల్గొనడంతో పాటు ట్రాన్స్‌కో, జెన్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలు వసూలు చేయాలని సింగరేణి సీఎండీ ఎన్. శ్రీధర్‌కు గురువారం ఆయన లేఖ రాశారు. బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొని సాధించడం ద్వారా సింగరేణి సంస్థ, కార్మికులకు ఇబ్బంది ఉండదని తెలిపారు. ఈనెల 15న కేంద్రప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రారంభించిన బొగ్గు బ్లాక్‌లో వేలంలో పాల్గొనే విషయమై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని యువకుడి మృతి


ఘటనాస్థలంలో ప్రసాద్ మృతదేహం

సత్తుపల్లిరూరల్: ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. వేంసూరు మండలం నాయకన్‌గూడెంకు చెందిన పుచ్చా ప్రసాద్ (25) పెయింటింగ్ పని కోసం గురువారం సత్తుపల్లి వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు.ఈక్రమంలోసత్తుపల్లి మండలం రేజర్ల సమీపాన ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఆయన వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్‌కు భార్య, కుమార్తె ఉండగా కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి పోలీసులు తెలిపారు.


కారు ఢీకొని వ్యక్తి..


రేపాకుల రాజు (ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలోని పాపాయిగూడెం క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పిండిప్రోలు శివారు పాపాయిగూడెం గ్రామానికి చెందిన రేపాకుల రాజు(35) మోటార్‌సైకిల్‌పై పిండిప్రోలు వెళ్తుండగా వరంగల్ నుంచిఖమ్మం వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజు తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కూలీ పనులు చేసుకుని జీవించే ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎన్నికలపై పాఠం!

- పదో తరగతి సోషల్ పుస్తకంలో పాఠ్యాంశం
- విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్యంపై అవగాహన
- ఎన్నికల వేళ ప్రత్యేకంగా బోధిస్తున్న ఉపాధ్యాయులు


ఖమ్మం శాంతినగర్ హైస్కూల్‌లో పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఖమ్మం సహకారనగర్: ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికలంటే హడావుడి అంతా ఇంతా కాదు. అయితే, ఎన్నికలంటే ఓటు వేయడం, ఎమ్మెల్యేను ఎన్నుకోవడమే కాదు ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎన్నికల ప్రక్రియ ఎంతో కీలకమైనది. ఈనేపథ్యాన విద్యార్థి దశ నుంచే ఎన్నికల ప్రక్రియ, ఓటింగ్, ఇతరత్రా అంశాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం పదో తరగతి సాంఘిక శాస్త్రం పుస్తకంలో 'భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ' పేరిట పాఠాన్ని ముద్రించింది. ఓటు హక్కు విలువను తెలియచేయడం, స్వేచ్ఛగా ఓటు వేయాల్సిన ఆవశ్యకత, ప్రలోభాలకు లొంగకుండా సేవ చేసే నాయకుడినే ఎన్నుకోవాలనే సూచనలను ఇందులో పొందుపరిచారు. సాంఘిక శాస్త్రం పుస్తకంలోని ఎనిమిది పేజీల్లో ఎన్నికల ప్రక్రియ వివరాలను ఎనిమిది పేజీల్లో ముద్రించగా.. ప్రస్తుత ఎన్నికల నేపథ్యాన ఉపాధ్యాయులు ప్రత్యేకంగా బోధిస్తున్నారు.

విద్యార్థి స్థాయి నుంచే...

పదో తరగతిలో ఎన్నికల ప్రక్రియపై పాఠ్యాంశాన్ని ముద్రించి బోధిస్తుండడం పౌరులుగా ఎదిగే విద్యార్థులకు తప్పనిసరని చెబుతున్నారు. అలాగే, విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సైతం ఓటింగ్ విధానం, స్వేచ్ఛగా ఓటు వేయడం, ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకుడిని ఎన్నుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించే అవకాశముంది. కాగా, ఈ పాఠ్యాంశంలో భారత ఎన్నికల వ్యవస్థ ఏర్పాటు, విధులు, ప్రతిపత్తి తదితర విషయాలను వివరించారు. అలాగే, 1950 జనవరి 25న ఏర్పడిన భారత ఎన్నికల సంఘం, తదనంతరం కాలంలో వచ్చిన మార్పులు, ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా టీఎస్.శేషన్ విధులు నిర్వర్తించిన సమయాన చేపట్టిన చర్యలను పేర్కొన్నారు.


పదో తరగతి సోషల్ పుస్తకంలోని ఎన్నికల పాఠ్యాంశం

అవగాహన ఇలా..

పదో తరగతి పాఠ్యాంశంలో భారత ఎన్నికల వ్యవస్థ, భారత ఎన్నికల సంఘం, ఎన్నికల సంఘానికి స్వయం ప్రతిపత్తి, ప్రధాన ఎన్నికల కమిషనర్ విధులు, ఓటింగ్ ప్రక్రియ, ఎన్నికల సమయంలో అధికార పార్టీ ఎలాంటి కార్యక్రమాలను చేపట్టవద్దు, ఓటరు ప్రతిజ్ఞ, వివిధ స్థాయిల్లో ఎన్నికల నిర్వహణ, నోటా, ఎన్నికల సంస్కరణలు, ఈవీఎం, కంట్రోల్ యూనిట్ల పనితీరును సమగ్రంగా వివరించారు.

అమ్మానాన్నకు వివరించా..



ప్రజాస్వామ్యంలో సుపరిపాలన అందించే వ్యక్తులను ఎన్నుకుంటేనే అభివృద్ధి జరుగుతుందని తెలిసింది. పాఠంలోని వివరాలు ఆధారంగా మా ఉపాధ్యాయులు అన్ని విషయాలు వివరించారు. దీంతో ఓటు వేయడం ఎంత తప్పనిసరో మా అమ్మానాన్నకు చెప్పా.

– ఎస్.వెంకటశివ, పదో తరగతి, శాంతినగర్ హైస్కూల్, ఖమ్మం

విద్యార్థి దశ నుంచే అవగాహన



పదో తరగతి సోషల్ పుస్తకంలో ఎన్నికల ప్రక్రియపై పాఠ్యాంశాన్ని ముద్రించటం అభినందనీయం. తద్వారా విద్యార్థి దశ నుంచే ఎన్నికలపై అవగాహన కల్పించడం సాధ్యమవుతుంది. ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్న క్రమంలో ఈ పాఠం బోధిస్తే విద్యార్థులు ఆసక్తి విన్నారు.

– వి.యాదగిరి, సోషల్ ఉపాధ్యాయుడు, మంగళగూడెం

అందుబాటులో ఉండే వారిని ఎన్నుకోవాలి



ఎన్నికల సమయంలో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా అందుబాటులో ఉండే వారిని ఎన్నుకోవాలని మా సార్ చెప్పారు. తద్వారా మంచి జరుగుతుందని వివరించాడు. ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈ పాఠం చెప్పడంతో అనేక విషయాలు తెలిశాయి.

– ఎస్.గోపీచందన, పదో తరగతి, మంగళగూడెం హైస్కూల్

జంగ్ తెలంగాణ

మీ గుర్తు మీకే...!

- జాతీయ, గుర్తింపు పొందిన పార్టీలకు శాశ్వతం
- మిగతా పార్టీలకు 'ఫ్రీ సింబల్స్' నుంచి కేటాయింపు



వైరా: ఎన్నికల్లో పోటీ చేసే జాతీయ, ప్రాంతీయ పార్టీలకు వారి రిజిస్టర్డ్ గుర్తులను ఎన్నికల సంఘం కేటాయిస్తుంది. ఒక సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఏవైనా నాలుగు రాష్ట్రాల ఓట్లలో నాలుగు శాతం సంపాదించగలిగితే దాన్ని జాతీయ పార్టీగా ఎన్నికల సంఘం గుర్తిస్తుంది. ఒక పార్టీ రాష్ట్రం లేదా ఒక ప్రాంతంలో నాలుగు శాతం ఓట్లు సాధిస్తే దాన్ని ప్రాంతీయ పార్టీగా గుర్తిస్తారు. ఆతర్వాత వీరికి ఎన్నికల సంఘం గుర్తులు కేటాయిస్తుంది. అయితే, సిద్ధాంత రీత్యా, వ్యక్తుల వల్లకానీ పార్టీ చీలిపోయినప్పుడు ఆ పార్టీ గుర్తును ఏ వర్గానికి కేటాయించాలన్న వివాదం ఏర్పడితే ఎన్నికల సంఘం సమస్యను పరిష్కరిస్తుంది.

జాతీయ పార్టీలు...

దేశంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన జాతీయ పార్టీలు ఏడు ఉన్నాయి. వీటికి ఎన్నికల సంఘం కేటాయించిన గుర్తులను మరే పార్టీకి కానీ, స్వతంత్రఅభ్యర్థులను కానీ కేటాయించదు. దేశంలో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, బహుజన సమాజ్‌పార్టీ, భారతీయ జనతా పార్టీ, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు), ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీలు జాతీయ పార్టీలుగా గుర్తింపు సాధించాయి.

రిజిస్టర్డ్, అన్ రికగ్నైజ్డ్ పార్టీలు

జాతీయ పార్టీలతో పాటు రిజిస్టర్డ్, అన్ రికగ్నైజ్డ్ పార్టీల తరఫున కూడా అభ్యర్థులు పోటీలో ఉంటా రు. ఈ పార్టీలను కొందరు వ్యక్తులు, సంస్థల పేరిట ఎన్నికల సంఘం వద్ద నమోదు చేస్తారు. ఎన్నికల్లో పోటీ చేసినా.. చేయకపోయినా అవి అలాగే కొనసాగుతుంటాయి. ఒకవేళ పోటీ చేస్తే ఆ పార్టీ అభ్యర్థులకు ఎన్నికల సమయాన ఎన్నికల సంఘం ఫ్రీ సింబల్స్‌గా ఉంచే వాటి జాబితా నుంచి గుర్తు కేటాయిస్తుంది. అయితే వారికి ఇండిపెండెంట్ అభ్యర్థుల కన్నా ముందు గుర్తులు ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తారు. ప్రస్తుతం మన దేశంలో సుమారు 1,983 రిజిస్టర్, అన్ రికగ్నైజ్డ్ పార్టీలు ఉన్నాయి. ఇవి తెలంగాణలో 73 వరకు ఉన్నాయి. అదే విధంగా 164 ఫ్రీ సింబల్స్ అందుబాటులో ఉంటాయి.

కాంగ్రెస్‌లో చేరిన నల్లమల

ఖమ్మంవన్‌టౌన్: రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. రైతుబంధు సమితి అధ్యక్ష పదవితో పాటు బీఆర్‌ఎస్‌కు ఆయన గురువారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షాన కాంగ్రెస్‌లో చేరగా ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.


వెంకటేశ్వరరావుకు కాంగ్రెస్ కండువా కప్పుతున్న రేవంత్‌రెడ్డి

జీవావరణ వ్యవస్థపై అవగాహన అవసరం


పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న అధికారి

కొత్తగూడెంఅర్బన్: పర్యావరణం, జీవావరణ వ్యవస్థలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని.. తద్వారా జీవుల మధ్య సమన్వయం ఏర్పడుతుందని రాష్ట్ర గ్రీన్ కోర్ కార్ప్(ఎన్‌జీసీ) ప్రతినిధులు తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో 'సుస్థిర అభివృద్ధి–జీవనశైలి'అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి పర్యావరణ శాఖ అడిషనల్ జనరల్ మేనేజర్ కె.రవికిరణ్ పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం భద్రాద్రి జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు మాట్లాడుతూ.. పర్యవరణం, జీవ వైవిధ్యాన్ని కాపాడితేనే మనుషుల మనుగడ సాఫీగా సాగుతోందని తెలిపారు. ఇప్పటికే వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నందున పర్యావరణానికి హాని కలిగించేలా ప్రవర్తించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీసీ మేనేజర్ శివరాం, సంపత్‌కుమార్, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగుతో మేలు

వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ సైంటిస్ట్ ప్రగతి


సదస్సులో మాట్లాడుతున్న సైంటిస్ట్ ప్రగతి

చింతకాని: యాసంగి సీజన్‌లో రైతులు వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ సైంటిస్ట్ సీహెచ్.ప్రగతి సూచించారు. చింతకాని మండలంలోని బస్వాపురం రైతువేదికలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, అఖిల భారత సమన్వయ పరిశోధన సంస్థ, వైరా కేవీకే, మధిర వ్యవసాయ పరిశోధన స్థానం సంయుక్త ఆధ్వర్యాన ఆరుతడి పంటలపై రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రగతి మాట్లాడుతూ.. వరి పంటకు బదులుగా పెసర, మినుము పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందొచ్చని తెలిపారు. అలాగే, యాసంగిలో వేరుశనగ, మంచిశనగ పంటల సాగుతో భూమిలో నత్రజని స్థిరీకరణ జరిగి భూసారం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇక మొక్కజొన్న సాగుతో అధిక దిగుబడి లభించడమేకాక చీడపీడల ఉధృతి కూడా ఉండదని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం సమన్వయ పరిశోధన సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ గోవర్ధన్, వైరా కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ శైలజ, మధిర వ్యవసాయ పరిశోధన స్థానం సైంటిస్ట్ డాక్టర్ రుక్మిణీదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్‌రెడ్డి, డాక్టర్ భరత్, డాక్టర్ ఫణిశ్రీ, డాక్టర్ అలీబాబా, ఏఓ పల్లెల నాగయ్య, ఏఈఓలు ఆయేషా, రజిత, హరికృష్ణ, కార్తీక్, గోపి, తాహియా నౌషీన్ తదితరులు పాల్గొన్నారు.

406 కేజీల గంజాయి, 756 లీటర్ల గుడుంబా స్వాధీనం

ఖమ్మంక్రైం: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి మద్యం, నాటుసారా గంజాయి రవాణా జరగకుండా ఎక్సైజ్ అధికారులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్దే కాకుండా సమస్యాత్మక గ్రామాల్లోనూ తనిఖీలు చేస్తున్నామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు రూ.కోటి విలువైన 406 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా రూ.3 లక్షలకు పైగా విలువైన 756 లీటర్ల గుడుంబా, రూ.1.50 కోట్ల విలువైన ఆశిష్ ఆయిల్, రూ.5 లక్షల విలువ గల నల్లబెల్లం, రూ.2.47 లక్షల విలువైన మద్యం, రూ.89 వేల విలువ కలిగిన బీర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

బావిలో పడి గేదె మృతి

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ గేదె మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బైరవునిపల్లి గ్రామంలో గురువారం రైతు బాలిన కృష్ణంరాజుకు చెందిన గేదె ప్రమాదవశాత్తు ఇంట్లో ఉన్న బావిలో పడి మృతి చెందింది. ఆ తరువాత స్థానికులు నానా అవస్థలు పడి ట్రాక్టర్ ద్వారా బయటకు తీసిన ఫలితం లేకుండా పోయింది. గేదె విలువ దాదాపు రూ.70 వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు.

మతోన్మాద, ఫాసిస్ట్ పార్టీలను ఓడిద్దాం

- కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థికి మద్దతు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంవన్‌టౌన్: మతోన్మాద, ఫాసిస్ట్ బీజేపీతో పాటు ఆ పార్టీతో అంటకాగుతున్న బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీల అభ్యర్థులను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. ఖమ్మంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజావ్యతిరేక విధానాలు కొనసాగుతుండగా, ప్రజాస్వామ్య హక్కులను పాలకులు కాలరాశారని విమర్శించారు. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వానికి నియంత్రణ లేకుండా పోయిందన్నారు. పాలకులు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచి సామాన్యులపై భారం మోపారని తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు వేర్వేరుగా కనపడుతున్నా స్వార్థప్రయోజనాల కోసం కలిసే పనిచేస్తున్నాయని రంగారావు చెప్పారు. స్వామినాథన్ సిఫారసుల ప్రకారం పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించకపోగా, బంజరు, అటవీ, పోడు, దేవాలయ భూములకు పట్టాలు ఇవ్వలేదని ఆరోపించారు. అశ్వారావుపేట, సత్తుపల్లి, సూర్యాపేటలో తాము పోటీ చేస్తుండగా, కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేనికి, ఇల్లెందులో గుమ్మడి అనురాధకు మద్దతు ఇస్తున్నట్లు రంగారావు తెలిపారు. డబ్బు సంచులతో వస్తున్న నేతలకు గుణపాఠం చెప్పి మంచి నాయకులను ఎన్నుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు రాయల చంద్రశేఖర్, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, పుల్లయ్య, జి.రామయ్య, శిరోమణి, ఝాన్సీ, ఆజాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ 'ఫలాలు'

ఖమ్మంవన్‌టౌన్: రానున్న ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని పాలేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేసిన ఆయన ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా బుర్హాన్‌పురం మార్కెట్‌లో కూరగాయలు తూకం వేయడంతోపాటు ఓ హోటల్‌లో దోసెలు వేశారు.



'సాఫ్' సీదా అభివృద్ధి

తల్లాడ: తెలంగాణలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలవుతున్నాయని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి తెలిపారు. తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య తరఫున ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తల్లాడలో ఓ ఇస్త్రీ షాపు వద్ద దుస్తులు ఇస్త్రీ చేసిన ఆయన తమది పారదర్శక పాలన అని తెలిపారు.



మేం బాగా నడుపుతాం...

మధిర: పోరాడి సాధించుకున్న తెలంగాణను మరింత అభివృద్ధి చేయడమే కాక సంపదను ప్రజలకు పంచుతామని మధిర కాంగ్రెస్ అభ్యర్థి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తెలిపారు. మధిర మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేసిన ఆయన రైతు, కూలీలతో మాట్లాడడంతో పాటు కాసేపు ట్రాక్టర్ నడిపారు. తమకు అధికారం కట్టబెడితే తెలంగాణ అన్నిరంగాల్లో ముందు నిలుపుతామని తెలిపారు.

